# పిల్లి

[లోకంలోని అన్ని వింతలతో పాటు ఈ వింతాను— వితంతువుల్లో చాలా మంది పిల్లుల్ని పెంచి, వాటికి చొక్కా-పరికిణీ కుట్టించి కట్టి, వాటికి తలంటి పోసి, వంటికి నూనెరాసి, నెలకో మాటైనా గుబిలి తీసి, వాళ్ళకు నచ్చిన ఏ మాచమ్మో, మంగమ్మో—పేరుబెట్టుకుని తనతో పాటు—తనకు కలిగి ఉన్నంతలో నెయ్యి పిడచలే దానికిబెట్టి కన్న కూతుళ్ళలాగు చూసుకునే వాళ్ళూ ఉన్నారు. అల్లాగే మన పిల్లీ. మా పిల్లి—అన్నది శ్రీవారి నిక్ నేము. శ్రీ 12 శాస్త్రిగారున్నారే వారు, పిల్లి అంటే ఉడికి చచ్చేటంత పని అవుతారు.... అది వారి నామవిశేషం—ఇది మనలో మాట.]

పొద్దున ఎనిమిది గంటల వేళ కాస్త కాఫీ దేవాలయానికి వెళ్ళి సంధ్య వార్చుకుని గ్రంథాగారానికి వెళ్ళి చదువుకుందామని పోతున్నా. కిళ్ళీ కొట్టు దగ్గరకు వచ్చేసరికి పిల్లి పిలుస్తున్నాడని కబురు!

లోపలికి వెళ్ళాను. లోపలికి వెళ్ళేటప్పటికి పిల్లి ఏం జేస్తున్నాడంటే—అద్దం ముందు కూర్చుని తన బెత్తెడు మీసాలకీ కామినియా ఆయిల్ రాసి సన్నపళ్ళ దువ్వెనతో దువ్వుకుంటున్నాడు—జ్వర పడ్డ పిల్లలకు తల దువ్వినట్లు. నే నేమనుకున్నా నంటే— ఒకవేళ పేలుచేరి మీసాల్లో విడిది చేశాయేమో పాపం బ్రాహ్మడు మరామత్తు చేసుకుంటున్నాడని. అబ్బే—అడిగి చూతునుగదా—అది వారి దినచర్యలో ప్రధాన కృత్యంట!—నేను వచ్చిన కాస్సేపటికి మీసాల మరామత్తు

ఏ.పి. ప్రాచ్య గ్రంథాలయం. [illegible]
ప్రవేశ సంఖ్య [illegible]



మాని రేగుపండు తొడిమో పాలకను స్వాధీనం చేసుకుని చెవిమీది వెంట్రుకలకు యింత భృంగామలక తైలం పూసి బ్రహ్మానంద భరితుడైనాడు —నేను ఉండలేక బాబూ పిలిచారట అన్నాను. "అవునండీ" అన్నాడు.

అల్లాగా అని పక్కనే ఉన్న లొడారి బుచ్చిగాడు-అన్న గ్రంథాన్ని తీసుకుని చూసి అక్కడ పెడుతున్నాను- ఇంతలో రొండినుండి పొడుం కాయ తీసి ఓ అరణా పొడుం—-రెండు ముక్కులకీ ఎక్కించి ట్రుయ్ మని చీదుకుని ఆ కళంకం అంటిన చేతులు కడుక్కోకుండానే అరిటి పళ్ళు వొలిచాడు. ఓటి నాకూ పెట్టవస్తే వద్దని ప్రతిమాలుకున్నాక అన్నీ దబాయించి తినేశాడు. ఏం ప్రాలుబ్ధంరా లైబ్రరీకి పోకుండా పిల్లి షాక్ యిచ్చింది—అనుకుని లోపల చిముడుతున్నాను. డజన్ పళ్ళూ తిన్నాక అల్మారాలోని యింత పొగాకు తీసుకుని చేతికి కాస్త సున్నం రాసుకుని కరకరా పటిక బెల్లంమల్లే తినేసి నావంక అల్లా పరమ సాహసి చూపులు చూశాడు. ఇక ఆగలేక లేవబోయాను. బాబూ రాత్రి నాటకానికి వెళ్ళారా అని అడిగాడు. వెళ్ళలేదని జవాబు చెప్పాను. పెదవులు చిట్లించుకుని సరే అని నిట్టూర్పు విడిచాడు. నాటి రాత్రి నాటకం తాను చూడకుండానే కర పత్రం సహాయంచేత తాను చేసిన ఊచయుద్ధం (క్రిటిసిజమ్) ఓ పద్ధాలుగు పేజీలవ్యాసం నా కందిచ్చాడు చూడమని. నాకు విసుగూ-కోపమూ వచ్చి సరేలెండి చూస్తాంగా పత్రికల్లో— అప్పుడు చదివే తరహా వేస యిప్పటి జాణీ వేస అని అన్నాను సర్దుకుని. దాన్ని ఆంధ్రపత్రికకు పంపుతానని చెప్పి జేబులో పెట్టుకుని వేషం వేసుకుని వీభూతీ అవీ రాసుకుని బైలుదేరాడు. నేనూ నడుస్తున్నాను—నేను కాఫీ దేవాలయమునకు వెళ్ళాను. ఆయనా వచ్చాడు. దారి పొడుగునా అంతా తన నాటకాల కల్చర్ చెపుతూనే ఉన్నాడు. గతిలేక నేను వింటూనే ఉన్నాను. కాఫీ హోటల్ గర్భగుడిలోకి చొరబడి కూర్చుని కృష్ణా! ఆపద్బాంధవా అని అరిచాను. కృష్ణుడు (సర్వ్ చేశేవాడు) వచ్చి కనుక్కుని, ఓ దోసె

అవీ తెచ్చిపెట్టాడు. మా పిల్లి ఓ అరప్లేటు కాఫీ తాగి అక్కణ్ణించీ బడితెబాజా లెక్చర్ ప్రారంభించాడు. ఆంధ్ర బలం-దేశబలం- ఆంధ్ర తేజస్సు-రోమ్ బలం అంటూ ప్రారంభం చేసి తెలుగువాళ్ళు ఉత్త చాత కాని వాళ్ళు, చవటలు, చాతనయితే హుషార్ ఉంటే ధీమా ఏడిస్తే వచ్చిన మీసాలకి నాలుగు మణుగురాళ్ళు ఎత్తండి అవలీలగా చేదేస్తారు, మీలో నేమిటి తెలుగు దేశంలో మొనగాళ్ళు ఉంటే రండి--షవ్వాల్! అంటూ తన తొడ పరుపును బాదినట్లుగా కొట్టుకున్నాడు.

నాతో కుస్తీపట్టి నన్నోడిస్తే వెయ్యి ప్రజంటు. లేకపోతే చాత కాకపోతే నేను తయారు చేసిన రోమకళ అన్న లేహ్యం ఓ మండలం సేవించండి. తర్వాత చెప్పుదురుగాని తడాఖా!

పచ్చిపేడ తన్నితే పదహారు వక్కలు కావాల్న. ఎండు పిడకను తన్నితే ఎగిరి ఎగిరి పడాలి! మరి ఏమనుకున్నారు—నా సత్తా నా లేహ్యం సత్తా ఉత్తదన్న వాళ్ళకు పంద రూపాయలు ప్రజంటు!! అని ఏక్ బిగిని లెక్చర్ ఊదేశాడు.

నవ్విన వాళ్ళు నవ్వారు; పిచ్చనుకున్నవాళ్ళు పిచ్చనుకున్నారు. ఇంతలో నా సంధ్యా వందనం పూర్తిచేసి తత్సత్ బ్రహ్మార్పణమస్తు అని పూర్తిచేసి చెయ్యి కడుక్కుని కిళ్ళీ బిగించి బిల్లు చెల్లించుకోటానికి యివతలకు వచ్చాను. రోమకళ రోమబలం ఆంధ్రబలం భీమబలం రోమకళ అంటూ పిల్లి బైటికొచ్చాడు, శాబవా అషూ యిషూ సర్దు కుంటూ.... తాను తాగిన అరప్లేటు కాఫీకి అర్ధణా చెల్లించి రోమకళ డబ్బీని అందరకూ చూపించాడు. అక్కడ ఉన్న పెద్ద మనిషి ఒకాయన డబ్బీ ఖరీదెంతండీ అని అడిగితే ఎంతేమిటి చాలా స్వల్ప ఖరీదుకే యిస్తున్నాను. అంటూ బైటపడీ హంగామాగా నడుస్తూ యింకో కాఫీ హోటలుకు చేరుకున్నాడు.

మఱచి పోయాను పిల్లి చరిత్ర చెప్పటం. మా పిల్లికి ఒడుగు పెద్ద వాళ్ళు చెయ్యలేదు. పెళ్ళీలేదు పెటాకులూ లేదు. నాటకకళ అభిమాన విద్య

అంటాడు. బడిత వైద్యం, భూతవైద్యం, రాచవైద్యం అంటూ వైద్యం కూడా తనకు వశమని చెప్తాడు. రోమకళ స్పెషలిస్టు నంటాడు.

అక్షరం ముక్కకంటె అఘాయిత్యానికి ఎక్కువ ప్రాముఖ్యం యిచ్చి, బ్రతుకు తెరువుని ఉపాసిస్తున్నాడు....

వీణ్ణి ఓ గంగా భాగీరథీ సమానురాలు అభిమానించింది. అప్పుడప్పుడు పిల్లికి తలంట్లూ—కొత్త చొక్కాలూ: వీడి భుక్తికి యింత పిండమూ, పొడుం, కాఫీ హోటల్ ఖర్చులు—వీడి వైద్యం ఖర్చులూ ఆవిడ అప్పుడప్పుడూ యిస్తూ ఉంటుంది. వీడు యిఖ పదిగంటల వేళ రోడ్డుమీద నుంచుని—స్వరాజ్య—హిందూ తీసి, హెడ్డింగులు బిగ్గరగా చదువుతూ—నుంచుంటాడు. ఎవరన్నా ఎరిగి ఉన్నవారు వస్తే వారికి పత్రిక యిచ్చి చదవమని గౌరవించి వారు చదివి చెప్పింది విని యిక యింటికి వెళ్ళి ఆ గంగా భాగీరథి దగ్గర—కన్సర్వేటివులు యిల్లా అన్నారు. కమ్యూనిష్టులు యిల్లా అన్నారు—లేబరు యిల్లా అంది ఫైనాన్సు యిల్లా ఉంది అంటూ రామాయణం కోస్తాడు. పిల్లికి రాని శాస్త్రం లేదు. పిల్లికి తెలియని అర్థులేదు. కొత్తవాళ్ళని షాక్ చెయ్యటం వాడి అభిమాన శిల్పం. వాడి తరహా అదీ అంతా వేరుట. వాడి ఉన్నతాశయాలూ అవీ అందరికీ అర్థంగావుట. అన్నట్లు మరచిపోయాను. వీడు కూడా కవి. నవలలూ డ్రామాలూ అవీ రాశాడు—వీడు. వీడికో సిద్ధాంతం ఉంది. అదేదనగా.

పొగాకు విరాట్ స్వరూపం, పొడుం పరమాత్మకు సన్నిహితమైన తాదాత్మ్యస్వరూపం. చుట్టా బీడీ సిగరెట్టులు ఉపాధి భేదం వల్ల వచ్చిన అపకారాలు అని తాను జగదతీత వ్యక్తి కనుక త్రిమతస్థుడుట—

అంటే కాలాను సారంగా పొడుం, పొగాకూ, కిళ్ళీ, పొగాకూ, చుట్టా, బీడీ, సిగరెట్లూ—అన్నీ సేవిస్తాడుట.